క్లుప్తంగా

జిల్లా వైద్యశాలలో లోపాలను సరిచేయండి

మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో నెలకొన్న లోపాలను సరిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ స్పీకర్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కోరారు. తెనాలి జిల్లా వైద్యశాలను శనివారం పరిశీలించారు. జిల్లా ఆస్పత్రితోపాటు తల్లి పిల్లల వైద్యశాలలోని ప్రతి వార్డును ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీటీ స్కాన్ పాడై ఏడాది దాటిన ఇప్పటి వరకు దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పేదలకు అన్నదానం

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని గంగానమ్మ మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెండ్యాల లీలా వెంకటకుమార్, చీమకుర్తి రామచంద్రరావు, వుప్పల వరదరాజులు, కోట సుబ్రహ్మణ్యం, కాలేషా, షేక్ మీరావలి, మురళి, కొల్లిపర సత్యనారాయణ, కొండూరి భాస్కరరావు, సుమన్, వేణుగోపాల్, అక్కల శ్రీరామ్, సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి

కొల్లిపర: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్థలం కేటాయించిన ప్రతి ఒక్క లబ్ధిదారు వారికి కేటాయించిన స్థలంలో తప్పకుండా మార్చి 30 లోగా గృహాలను నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. మండల పరిధిలోని చక్రాయపాలెంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకునే ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి చందు బాబూరావు, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకట్రావు సేవలు మరువలేనివి

తెనాలి అర్బన్: పేద విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించిన వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని వెంకట్రావు సేవలు మరవలేనివని డబుల్ హార్స్ మినపగుళ్ల సంస్థ అధినేత మునగాల శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. వెంకట్రావు వర్ధంతిని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ వి.రమేష్, ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ఎ.రామారావు పాల్గొన్నారు.

సంస్కరణల ఘనత సీఎం జగన్‌దే

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 38వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి అర్బన్: విద్య వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 38వ వార్డులో శనివారం సాయంత్రం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్ కన్సెప్టును తీసుకువచ్చి ప్రజల వద్దకే వైద్యాన్ని చేరువచేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, 38వ వార్డు కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, రాష్ట్ర కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, 38వ వార్డు నాయకులు పెసర్లంక రమణ, షేక్ మీరావలి, బొమ్ము నాగిరెడ్డి, మునిపల్లి వంశీ, కఠెవరపు శంకర్, కఠెవరపు చిన్న వెంకటరమణ పాల్గొన్నారు.

ఐఆర్‌ఎస్‌లు సమాజానికి రోల్‌మోడల్

ఆదాయపన్ను శాఖ పూణే కమిషనర్ బీకే రావ్



మధుబాబు, విజయ్‌బాబును సత్కరించి జ్ఞాపికను బహూకరిస్తున్న బీకే రావ్ తదితరులు

తెనాలి: దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి ఐఆర్‌ఎస్ హోదాకు పదోన్నతి పొందిన దోనేపూడి మధుబాబు కృషి స్ఫూర్తిదాయకమని ఐఆర్‌ఎస్ అధికారి, ఆదాయ పన్ను శాఖ పూణే కమిషనర్ బీకే రావ్ అన్నారు. తన కవల బిడ్డలనూ తన దారిలోనే ప్రోత్సహిస్తూ అందులో ఒకరు ఇప్పటికే ఐఆర్‌ఎస్ సాధించగా, మరొకరు అదే ప్రయత్నంలో ఉండటం గొప్ప విషయమని చెప్పారు. కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా చేస్తూ ఇటీవలే అసిస్టెంట్ కమిషనర్ ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి పొందిన దోనేపూడి మధుబాబు, సివిల్స్‌లో నెగ్గి ఐఆర్‌ఎస్ అధికారిగా శిక్షణలో ఉన్న కుమారుడు విజయ్‌బాబు అభినందన సత్కారసభ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. గుర్రం జాషువా విజ్ఞాన సమితి, వన్‌లైన్ అసోసియేషన్ సంయుక్తంగా స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటుచేసిన సభకు సినీదర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి బీకే రావ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విశ్రాంత డీఐజీ బాలస్వామి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎన్నారై మండలి ఆనంద్‌బాబు, ప్రకాశం జిల్లా మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, చేబ్రోలు ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితం

కొల్లిపర: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తూములూరులోని ఎంపీపీ ఎస్‌హెచ్‌సీ పాఠశాలను శనివారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించి చదవాలని ఆ తర్వాత రివిజన్ చేసుకుంటే పరీక్షల్లో ఎలాంటి ఇబ్బంది ఉండదు అన్నారు. పాఠశాలలో ఏదో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్‌ను కేటాయించి చదివించాలని వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా ఉపాధ్యాయులు వారిపై శ్రద్ధ సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజీ అవకాశం ఉన్న కేసులన్నీ పరిష్కారమయ్యేలా చూడండి

తెనాలి రూరల్: రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులన్నీ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో తెనాలి పట్టణలోని సీఐలు యు.శ్రీనివాసులు, ఎస్.వెంకట్రావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సినీ నటి జమునకు నివాళి

తెనాలి టౌన్: సినీ రంగంలో ధ్రువతారగా వెలుగొందిన తార జమున అని తెనాలి కల్చరల్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు రావిపాటి వీరనారాయణ పేర్కొన్నారు. నాజర్‌పేటలోని వివేక జూనియర్ కాలేజ్‌లో శనివారం జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేజళ్ల ఉమామహేశ్వర్, రాజాకృష్ణ పాల్గొన్నారు.

కవితల పోటీల్లో విజేత దేవికారాణి



తెనాలి: జాతీయ కవితల పోటీల్లో పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి విజేతగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన సాహితీ సంస్థ 'అక్షరాల తోవ' వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో 'ప్రజాస్వామ్యపు పట్టుకొమ్మ' అనే కవితతో దేవికారాణి ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించనున్న వార్షికోత్సవ సభలో ఆ రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతులమీదుగా సత్కారం స్వీకరించనున్నారు. తెలుగులో తొలి గజల్ కవయిత్రిగా గుర్తింపు పొందిన ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొలకలూరి స్వరూపరాణి కుమార్తె దేవికారాణి. ఆమె తాత నడకుర్తి వెంకటరత్నం కవిపండితుడు. ఆ వారసత్వంగానే తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవికారాణికి సాహిత్యం, సంగీతం, కళలపై అభిరుచి, ఆసక్తి ఏర్పడ్డాయి. గేయాలు రాయడం, పాడటం, వ్యాసాలు, వచన కవితలు, ప్రక్రియా సాహిత్యం (కథ, పెన్‌కౌంటర్, మిరీ ్లు (వామన కవిత్వం), హైకూలు, బాలసాహిత్యంలో అభినయ గేయాలు రాస్తున్నారు. వీరి కవితలు, కథలు పలు దిన, వార, మాసపత్రికల్లో, కవితా సంకలనాల్లో ప్రచురితమయ్యాయి. సాహితీ సభలు, కవి సమ్మేళనాల్లో పాల్గొంటున్నారు.

ముగిసిన మహాసంప్రోక్షణ ఉత్సవాలు

తెనాలి టౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మహా సంప్రోక్షణ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు రాజగోపుర సంప్రోక్షణ, గణపతి, నాగేంద్రస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఉత్సవ మూర్తుల ఆరాధన, పూర్ణాహుతి కార్యక్రమాలను వైఖానస పండితులు ఆగమయుక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు శాంతి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. టీటీడీ ఆగమ సలహాదారులు టీ సీతారామాచార్యులు, వైఖానస పండితులు రఘురామ్, ఫణీకుమార్, నాగమారుతీల ఆధ్వర్యంలో వైదిక క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపరంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిలీయ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంజం రామారావు, కోట రమేష్‌బాబు, పి.త్రిమూర్తి దంపతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సంవత్సరం 2023 పై సస్యభారత్

తెనాలి టౌన్: భారతదేశంలో వ్యవసాయ మీద ఆధారపడి సుమారు 70శాతం మంది జీవనం సాగిస్తున్నారని భారతదేశ ఆర్థిక స్థితిగతులు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. గంగానమ్మపేటలోని చైతన్య స్కూల్ గ్రౌండ్ ఆవరణలో శనివారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023పై సస్యభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి తెనాలి ఏడీఏ కె.వెంకట్రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీఏ రామాంజనేయులు, వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్(తెనాలి), టి.శిరీష(దుగ్గిరాల) పాల్గొన్నారు.

వేళాంగణిమాత దేవాలయంలో జనవరి పండుగ



తెనాలి టౌన్: రూరల్ మండలం అంగలకుదురులోని వేళాంగణిమాత దేవాలయంలో శనివారం జనవరి పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫాదర్ మాత్యూ దివ్యబలిపూజను జరిపారు. బైబిల్ నుంచి వాక్యోపదేశం అందజేశారు. ఫాదర్ మరియదాసు బైబిల్ గ్రంథంలో ఉన్న 10 ఆజ్ఞలను వివరించారు. విచారణ ఫాదర్ ధనరాజు అధ్యక్షత వహించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



అయ్యప్పస్వామి ఆలయంలో సూర్యయంత్రం వద్ద పూజలు నిర్వహిస్తున్న హరిబాబు

తెనాలి టౌన్: రథ సప్తమి(సూర్యజయంతి) వేడుకలను శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో బాలస్వామిజీ ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలను జరిపారు. సూర్యనారాయణ స్వామివారి దివ్య అనుగ్రహం పరిపూర్ణంగా లభించాలని బాలస్వామిజీ ఆశీర్వచనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- బాలాజీరావుపేటలోని అయ్యప్పస్వామి ప్రధాన ఆలయంలో రథసప్తమి వేడుకలను జరిపారు. దుర్భహరిబాబు స్వామి సూర్యయంత్రాన్ని ఏర్పాటు చేశారు.
- పట్టణ పినపాడులోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సూర్య జయంతి సందర్భంగా స్వామివారిని సూర్యప్రభ వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు శ్రీమాన్ పంచాగం రామానుజస్వామి ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో శ్రీ వెంకటేశ్వర అనామాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి వసుంధర, బృందం సభ్యులు నగర సంకీర్తన చేశారు.
- షరాఫ్ బజార్‌లోని భద్రావతి సమేత భావనారుషి దేవస్థానంలో రథసప్తమి వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా భావనాఋషి స్వామివారిని రథంపై ఉంచి పద్మశాలీ సంఘీయులు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

కొల్లిపర: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని ఎస్ఐ రవీంద్రారెడ్డి సూచించారు. స్థానిక ప్రధాన కూడలిలో వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వాహన ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వలన ఎక్కువ శాతం ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడమే కాకుండా వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు వాహనలో తప్పనిసరిగా ఉండాలని అన్నారు.